షాక్ కొట్టిస్తున్నారు

- ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం
- విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట బాదుడు
- యూనిట్‌పై సరాసరిన రూ.1.5 మోత
- వైఎస్సార్‌సీపీ పోరుబాట నేడు

నగర వాసులపై భారం: రూ.50 కోట్లు (నెలకు)

డివిజన్	- నెల్లూరు టౌన్, రూరల్
కనెక్షన్లు	- 3,60,503

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో విద్యుత్ బిల్లును చూస్తేనే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని.. సర్‌చార్జీలను విధించబోమని.. అవసరమైతే 30 శాతం మేర తగ్గిస్తామంటూ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చి నెలలు గడవక ముందే ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో వీరబాదుడు బాదుతున్నారు. యూనిట్‌కు సరాసరిన రూ.1.5 మేర వసూలు చేస్తుండటంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పోరుబాటను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం చేపట్టనుంది.



నెల్లూరు(వీఆర్సీ సెంటర్) / నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వ తీరుతో విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. వర్షాలు కురుస్తుండటం.. చలి తీవ్రతతో వినియోగం అంతంతమాత్రంగా ఉన్నా, బిల్లులు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. నవంబర్, డిసెంబర్‌లో అందజేసిన బిల్లులను చూసి గుడ్లు తేలేయడం వినియోగదారుల వంతవుతోంది. తక్కువ వినియోగించినా, ఎక్కువ మొత్తాన్ని బిల్లుల్లో చూపుతున్నారు.

అంతా అయోమయం

సర్దుబాటు పేరుతో వినియోగదారులపై భారాన్ని ప్రభుత్వం మోపుతోంది. బిల్లులపై నవంబర్ నుంచి యూనిట్‌కు రూ.1.5 చొప్పున వసూలు చేస్తోంది. ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలపై ప్రతి నెలా అదనపు భారం పడుతోంది. నగరంలో ఈ మొత్తం రూ.50 కోట్లకుపైగా ఉంటుంది.



విద్యుత్ భవన్



చార్జీలు పెంచడం సరికాదు



నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్లు తాజాగా విద్యుత్ చార్జీలనూ పెంచారు. దీంతో వారిపై మరింత భారం పడనుంది. వీటిని ప్రభుత్వం వెంటనే తగ్గించాలి. ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వం భరించకపోతే ఉద్యమాలు చేస్తాం.

– నాగేశ్వరరావు, సీపీఎం నేత

అధికారంలోకి వచ్చాక మాట తప్పారు



అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం సర్దుబాటు పేరుతో ప్రజలపై భారాన్ని మోపడం సరికాదు. పెంచిన చార్జీలను తగ్గించకపోతే ప్రజా వ్యతిరేకతను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– సురియా, గృహిణి

అదనపు చార్జీలంటూ బాదేస్తున్నారు



విద్యుత్ చార్జీలు భారీగా పెరిగాయి. గత నెలతో పోలిస్తే ఈ నెల వినియోగం తక్కువగా ఉన్నా, బిల్లు తగ్గలేదు. అదనపు చార్జీలంటూ మోత మోగించారు. కూలీ పని చేసుకొని బతికేవాళ్లం. ఇంత మొత్తంలో వస్తే మేమెలా కట్టగలం..? కరెంట్ చార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పారు. ఇప్పుడేమో ఇలా బాదేస్తున్నారు.

– షాజహాన్, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

తక్కువ వాడినా ఎక్కువ బిల్లు వస్తోంది



చలికాలం కావడంతో ఇంట్లో ఫ్యాన్‌ను సైతం సక్రమంగా వాడటం లేదు. పగలు ఉద్యోగానికి వెళ్లి.. సాయంత్రానికి ఇంటికొస్తాం. అయినా బిల్లు మాత్రం ఎక్కువగా వస్తోంది. ప్రైవేట్‌గా చిన్న ఉద్యోగం చేసుకొని బతుకుతున్నాం. మాలాంటి మధ్య తరగతి వారిపై భారం మోపుతారనుకోలేదు.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట

క్లుప్తంగా

వర్మికంపోస్ట్ తయారీపై శిక్షణ



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మికంపోస్ట్ తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. వర్మికంపోస్ట్ ద్వారా తయారు చేసిన ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారవంతంగా ఉంటుందని చెప్పారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(అర్బన్): బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా వెంకటలక్ష్మి బాధ్యతలను స్వీకరించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌ను కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా గురువారం కలిసి బొకేను అందజేశారు.

ముగిసిన మండల పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో 41 రోజులుగా నిర్వహిస్తున్న మండల పూజలు గురువారంతో ముగిశాయి. హోమాలు, క్షీరాభిషేకం, మహాగణపతి హోమం, పడికర్పూరం, శీవేలి ఉత్సవం తదితరాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా గూడల శేషగిరిరావు, చెంచలాదేవి, డాక్టర్ కిరణ్‌కుమార్, సునీల వెంకటమౌర్య, ఆనంద్, మాధురి సురేంద్రనాథ్, మాధవి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాజ అధ్యక్షుడు శేషగిరిరావు మాట్లాడారు. అయ్యప్పస్వామి నగరోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని చెప్పారు. కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, మోహన్‌రావు, విజయకుమార్, పావళ్ల ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

జీజీహెచ్ ఏఓ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(అర్బన్): కర్నూలు జిల్లా డోన్ ఆర్డీఓగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డిని నెల్లూరు సర్వజన ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. ఈ క్రమంలో బాధ్యతలను గురువారం ఆయన స్వీకరించారు. ఆయనకు పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘన సన్మానం



నెల్లూరు(అర్బన్): సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాతను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. పూల మొక్కను అందజేసి సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, పీఎంపీ జిల్లా నేతలు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, వీరయ్య, మాలిని తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



నేత్రదాత కుటుంబసభ్యులకు సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన సమీపంలో నివాసం ఉంటున్న రక్తదాత నీలకంఠం పవన్‌కుమార్‌రెడ్డి గుండెపోటుతో గురువారం మృతి చెందారు. నివాళులర్పించేందుకు వెళ్లిన శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడు నేత్రదానంపై మృతుడి తండ్రి శ్రీనివాసులురెడ్డిని ఒప్పించారు. దీంతో నేత్రాలను ప్రభుత్వాస్పత్రి నేత్రాలయ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నోవా బ్లడ్ బ్యాంక్ బాధ్యులు బావిశెట్టి వెంకటకిశోర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చిన్నబజార్ మండలాధ్యక్షుడి ఎన్నిక

నెల్లూరు రూరల్: బీజేపీ చిన్నబజార్ మండల ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షుడు హేమంత్‌కుమార్‌ను మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. పార్టీ నేతలు సామంచి శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్, రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, మండల కో ఎన్నికల అధికారి కిపూడి బాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి

నెల్లూరు(అర్బన్): విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబసభ్యులకు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాతకు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యోగుల జీతాలు, ఇతర ఆర్థికపరమైన బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూడాలని కోరారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద, హంస జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్, నేతలు నారాయణరాజు, శేషగిరిరావు, మజరుల్లా, సుధాకర్‌రెడ్డి, సహన, వెంకటమురళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

సంతపేటలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల పలు విభాగాలను డీఎంహెచ్‌ఓ సుజాత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించాలని కోరారు. డాక్టర్లు, నర్సులు, పింఛనర్ల ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లో ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

ఆర్చరీ జాతీయ పోటీలకు ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాజమహేంద్రవరంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో కాంస్య పతకాన్ని ములాపేటలోని లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి అక్షయ్ మహదేవ్ సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు మాట్లాడారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జనవరి మూడు నుంచి ఐదు వరకు నిర్వహించనున్న ఏటీపీసీ సబ్ జూనియర్స్ రికర్వ్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారని చెప్పారు. అక్షయ్ మహదేవ్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

వృద్ధుడి మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో.. ఇతర కారణమో తెలియదు గానీ ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. హరనాథపురం రెండో వీధిలో నివాసం ఉంటున్న భరత్‌రెడ్డి (64) నగరంలో భిక్షాటన చేసేవారు. ఈ క్రమంలో ఆయన ఉంటున్న ఇంటి నుంచి తీవ్ర దుర్గంధం గురువారం రావడంతో బాలాజీనగర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపులు తెరిచేందుకు యత్నించగా, లోపల గడియపెట్టి ఉండటంతో సాధ్యం కాలేదు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లిచూడగా భరత్‌రెడ్డి చనిపోయి ఉన్నారు. ఆయన మరణించి మూడు రోజులై ఉండొచ్చని భావిస్తున్నారు. గుండెపోటుకు గురై మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. మృతుడి భార్యాపిల్లలు గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, అప్పటి నుంచి ఆయన ఒంటరిగా ఉంటున్నారని స్థానికులు తెలిపారు.

కార్పొరేషన్ కార్యాలయ ఎదుట ధర్నా

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య ఆరోపించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయ ఎదుట నిరసనను గురువారం చేపట్టారు. ప్రధాన గేట్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కుదిరిన కొన్ని ఒప్పందాలకు సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖ అనుమతి కోసం ఉందని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని వెనక్కి తెప్పించే చర్యలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. నాటి ఒప్పందాలను అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులకు రెయిన్ కోట్లు ఇవ్వకుండా, స్టోర్‌రూమ్‌లో ఉంచడం సిగ్గుచేటని విమర్శించారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజను వినతిపత్రాలను అందజేశారు. యూనియన్ నేతలు లోకేష్, అశోక్, శ్రీనివాసులు, దేశమూర్తి, బాలు, మనోజ్, జయకుమార్, వజ్రమ్మ, భాగ్యమ్మ, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో కంచికామకోటి పూర్వ పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాన్ని చక్రాల వారి ట్రస్ట్, ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. చంద్రశేఖరేంద్ర సరస్వతికి పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా ఉపన్యాసకుడు అగస్త్యరాజు వెంకటసుబ్బారావు హాజరయ్యారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శివకుమార్, శివప్రసాద్, లక్ష్మీకామాక్షి, షణ్ముగం, రామ్‌గోపాల్, ములుగు ఉదయ్‌కుమార్‌శర్మ, మైపాడు రాజాశర్మ, చక్రాల వెంకటలక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.



అగస్త్యరాజు వెంకటసుబ్బారావుకు సత్కారం

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు సిటీ: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో మూలవర్లకు అభిషేకం, తిరుప్పావై సేవను గురువారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆదాలను కలిసిన విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమంపై వీరు చర్చించారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని ఎరుకలపాళెంలో నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు దుప్పట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు, అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ మాట్లాడారు. అబైడింగ్ హోప్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, అమరావతి చాప్టర్ సౌజన్యంతో వీటిని అందజేశామని వివరించారు. జాషువా, మరలిన్, విలియమ్స్ పాల్గొన్నారు.



పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

- ఆర్టీసీ ఆపరేషన్స్ ఈడీ అప్పలరాజు

నెల్లూరు సిటీ: ఆర్టీసీ బస్టాండ్ల నుంచి రోజూ లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, వీరి సౌకర్యార్థం బస్టాండ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సంస్థ ఆపరేషన్స్ ఈడీ అప్పలరాజు చెప్పారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌ను ఈడీ అప్పలరాజు, సీటీఎం నాగేంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. డిపో – 1, 2 గ్యారేజీ, ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్లు, పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. నెల్లూరు జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, నెల్లూరు డీపీటీఓ మురళీబాబు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న అప్పలరాజు

సండే మార్కెట్ క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): నగరంలోని సండే మార్కెట్ 16వ వార్షిక క్యాలెండర్లను మార్కెట్ సమావేశ మందిరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్కెట్ గౌరవాధ్యక్షుడు కిశోర్‌బాబు మాట్లాడారు. సైన్స్ ఫలాలను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పోరాడాలని కోరారు. మార్కెట్లో వస్తువులను పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంచామని వివరించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హఫీజుద్దీన్, సామాజిక కార్యకర్త సుకుమార్‌రెడ్డి, హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నేత చలపతి, హేతువాది స్వరాజ్యలక్ష్మి, తెలుగు భాషోద్యమ నేత చలంచర్ల బాస్కర్‌రెడ్డి, కమిటీ కార్యదర్శి సెంథిల్‌కుమార్, శరవణన్, ముత్తుమారి తదితరులు పాల్గొన్నారు.



బాబోయ్.. పందులు

- జనావాసాల్లో పెరిగిన సంచారం
- వ్యాధులు ప్రబలుతాయనే ఆందోళనలో ప్రజలు
- కట్టడి చేయాలని వినతి

నెల్లూరు(బారకాసు): నగరంలో పందుల స్వైర విహారం ఎక్కువైంది. గతంలో ఇదే తరహాలో పరిస్థితి నెలకొనడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో వీటిని కార్పొరేషన్ అధికారులు పట్టించి దూర ప్రాంతాల్లో వదిలేశారు. అనంతరం ఈ అంశాన్ని విస్మరించారు. ఈ తరుణంలో నగరంలో మరోసారి సమస్య రాజ్యమేలుతోంది. నగరంలో సుమారు వందకుపైగా పందుల పెంపకందారులున్నారు. వీరు పదుల సంఖ్యలో పెంచుతూ ఉంటారు. నగరంలోని నజీర్‌తోట, వెంకటేశ్వరపురం టిడ్కో గృహాల సముదాయం, రాజీవ్‌గృహకల్ప, సర్వేపల్లికాలువ అంచున, కల్లూరుపల్లి, కొత్తూరు, వైఎస్సార్‌నగర్, బుజబుజ నెల్లూరు తదితర ప్రాంతాల్లో వీటి తాకిడి అధికంగా ఉంది. రోడ్లపై వదిలేయడంతో అవి ఇళ్ల మధ్య సంచరిస్తూ ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. వ్యాధులు ప్రబలుతాయేమోననే ఆందోళనలో ప్రజలు ఉన్నారు.

కాగితాలకే పరిమితమైన షెడ్లు

నగరంలో పందుల సంచారంపై గతంలో ఎక్కువగా ఫిర్యాదులు అందడంతో నిర్వాహకులతో నాటి పాలకులు, అధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి నగరానికి దూరంగా షెడ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటిని రోడ్లపై వదలకుండా చూడాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. షెడ్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పినా, వాటి ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నజీర్‌తోటలో సంచరిస్తున్న పందులు

రోడ్లపై వదిలితే చర్యలు



పందుల పెంపకందారులు తమ ఇంటి పరిసరాల్లో షెడ్లను ఏర్పాటు చేసుకొని అవి అక్కడే సంచరించేలా చూడాలి. నిబంధనలను అమలు చేసేందుకు గానూ నగరంలోని పందుల పెంపకందారుల వివరాలను సేకరిస్తున్నాం. రోడ్లపై వదలొద్దంటూ నోటీసులను అందజేయనున్నాం. అప్పటికీ మార్పు రాకపోతే చర్యలు చేపడతాం.

– మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు, నగరపాలక సంస్థ